www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 30 నవంబర్ 2023

అక్రమ నిర్మాణాలపై సమగ్ర విచారణ జరిపించాలి

డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శర్మ, ధనుష్

భీమవరం: నరసాపురం ఆంజనేయస్వామి ఆలయ భూముల్లో అక్రమ నిర్మాణాలపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎస్‌విఎన్.శర్మ, జి.ధనుష్ ఒక ప్రకటన విడుదల చేశారు. నరసాపురంలోని ఆంజనేయస్వామి దేవస్థానానికి సంబంధించిన 50 సెంట్లు స్థలంలో ఎటువంటి అనుమతులూ లేకుండా నిర్మాణాలు చేపట్టడం సరైనది కాదని పేర్కొన్నారు. స్థానిక ఎంఎల్ఎ జోక్యంతో మున్సిపల్ అధికారులు నిర్మాణాలు చేపట్టడం తగదని తెలిపారు. దేవాదాయశాఖ భూమిలో స్థానిక యువతకు ఉపయోగపడేలా ప్రత్యామ్నాయ నిర్మాణాలు చేపట్టాలని కోరారు. దేవాలయ భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అసైన్డ్‌దారులకు ప్రతికూలంగా ప్రభుత్వ నిబంధనలు

20 ఏళ్లు పొజిషన్‌లో ఉంటే వారికే సొంతమట

ఏలూరు జిల్లాలో 2003కు ముందు 62 వేల ఎకరాలు అసైన్డ్ భూముల పంపిణీ

పేదలకిచ్చిన భూముల్లో 90 శాతం ప్రస్తుతం బడాబాబుల చేతుల్లోనే

ప్రభుత్వ నిర్ణయంతో అసైన్డ్ భూములన్నీ పెద్దలకే

అసైన్డ్ పెద్దల పరమే..!

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పేదలకు పంపిణీ చేసిన అసైన్డ్ భూములు బడాబాబుల చేతుల్లోకి వెళ్లిపోనున్నాయి. ప్రభుత్వ నిర్ణయంతో పేదలకు తీరని అన్యాయం జరగనుంది. పాలకులు తీసుకున్న నిర్ణయంతో పేదలకు సెంటుభూమి కూడా లేకుండాపోనుంది. 2003కు ముందు వరకూ ఏలూరు జిల్లాలో 62 వేల ఎకరాల అసైన్డ్ భూములు పేదలకు పంపిణీ చేసినట్లు అధికారులు తేల్చారు. పంపిణీ చేసిన భూముల్లో 90 శాతం ఇప్పటికే బడాబాబుల చేతుల్లోకి వెళ్లిపోయాయి. తమ భూములు తమకే ఇవ్వాలంటూ అనేక ప్రాంతాల్లో పేదలు పోరాటాలు చేస్తున్నారు. ఏలూరు జిల్లాలోని దోసపాడులో 150 ఎకరాల అసైన్డ్‌భూమికి సంబంధించి అక్కడి దళితులు ఏళ్ల తరబడి పోరాడుతూనే ఉన్నారు. తమకు న్యాయం జరుగుతుందని వెయ్యి కళ్లతో వేచి చూస్తున్నారు. టి.నరసాపురం వంటి అనేక మండలాల్లో భూపోరాటాలు జరుగుతున్నాయి. ఈ తరుణంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పేదలకు పెనుశాపంగా మారింది.

పేదలంతా తమ భూములను కోల్పోనున్నారు. అదే జరిగితే పేదల జీవితాల్లో పూర్తిగా చీకట్లు కమ్ముకోనున్నాయి. అసైన్డ్ భూముల్లో 20 ఏళ్ల పొజిషన్‌లో ఉన్నవారు మార్కెట్ ధరకు మూడు రెట్లు చెల్లిస్తే వారికే రిజిస్ట్రేషన్ చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. దీంతో పేదల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. స్థానిక అధికారుల సాయంతో 20 ఏళ్ల పొజిషన్‌లో ఉన్నట్లు చూపించి పేదలకిచ్చిన అసైన్డ్ భూములన్నీ పెద్దలు సొంతం చేసుకునే పరిస్థితి నెలకొంది. దీన్ని అసైన్డ్ భూములు పొందిన పేదలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. కోనేరు రంగారావు కమిటీ సిఫార్సుల ప్రకారం అసైన్డ్ భూమి వారసత్వంగా ఇవ్వాలే తప్ప అమ్మకాలు, విక్రయాలు చెల్లవు. అందుకు విరుద్ధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోంది. పేదల నిస్సహాయతను అడ్డం పెట్టుకుని అప్పట్లో పేదలకిచ్చిన అసైన్డ్ భూములను పెద్దలు తమ వశం చేసుకున్నారు. నిబంధనల ప్రకారం ఆ భూములన్నీ పేదలకు అప్పగించాల్సి ఉంది. ప్రభుత్వం మాత్రం అందుకు వ్యతిరేకంగా ముందుకు సాగుతోంది. పేదల ఆర్థిక పరిస్థితిలో మార్పు రావాలంటే భూమి అనివార్యమని ఎన్నో పోరాటాలు సాగాయి. వామపక్షాలతో సహా ప్రజాసంఘాల పోరాటాల ఫలితంగానే పేదలకు అప్పట్లో ప్రభుత్వాలు భూపంపిణీ చేశాయి. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో మళ్లీ పేదలకు భూమి అనేది లేకుండా పోయే పరిస్థితి ఏర్పడనుంది. భూమి మొత్తం కొద్దిమంది చేతుల్లోకే వెళ్లిపోనుంది. గతంలో పంపిణీ చేసిన వేలాది ఎకరాల భూములను బడాబాబులకు కట్టబెట్టి.. ఇప్పుడు ఏదో తూతూమంత్రంగా భూపంపిణీ చేస్తున్న పరిస్థితి ఉంది. ఏలూరు జిల్లాలో ఇటీవల 752 మందికి 693.25 ఎకరాలకు సంబంధించి పట్టాలిచ్చే కార్యక్రమం చేపట్టారు. గతంలో పంపిణీ చేసిన భూములను బడాబాబులకు ధారాదత్తం చేయాలనుకోవడం అత్యంత దారుణమనే విమర్శలు విన్పిస్తున్నాయి. ప్రభుత్వ నిర్ణయం వేలాది మంది పేదలకు పెనుశాపంగా మారిన పరిస్థితి ఉంది. అసైన్డ్ భూములను అసలైన పేదలకు అప్పగించాలని అంతా కోరుతున్నారు. అప్పుడే పేదలకు న్యాయం జరిగే పరిస్థితి ఉంటుంది.

హెలీప్యాడ్, సభాస్థలి ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్‌పి

8న సిఎం పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు

హెలీప్యాడ్, సభాస్థలిని పరిశీలించిన కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

ఈ నెల 8న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి భీమవరం పర్యటన సందర్భంగా హెలీప్యాడ్, సభాస్థలిని పటిష్టంగా ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. బుధవారం హెలీప్యాడ్, సభాస్థలి ప్రాంతాలను ఆమె జిల్లా ఎస్‌పి యు.రవిప్రకాష్, సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. తొలుత విష్ణు కాలేజీ రోడ్డులో మారుతి సుజుకి షోరూమ్ దగ్గర్లో ఉన్న స్థలాన్ని హెలీప్యాడ్ నిర్మాణానికి పరిశీలించారు. స్థలానికి దగ్గరలో నిర్మించి ఉన్న రూమ్‌ను గ్రీన్‌రూమ్ ఏర్పాటుకు పరిశీలించాలని సూచించారు. హెలీప్యాడ్ నిర్మాణంతోపాటు అంతర్గత రోడ్లను కూడా పకడ్బందీగా నిర్మించాలని ఆర్‌అండ్‌బి, మున్సిపల్ అధికారులను ఆదేశించారు. సభా స్థలికి చుట్టుపక్కల ఉన్న మొక్కలను తొలగించి శుభ్రం చేయించాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. హెలికాప్టర్ దిగడానికి ఏవిధమైన ఆటంకాలూ ఏర్పడకుండా ముందస్తుగా చుట్టుపక్కల ప్రాంతాలను పరిశీలించి అవసరమైన వాటిని తొలగించాలని సూచించారు. అనంతరం గ్రంధి జూనియర్ కాలేజ్ వెనుకవైపు ఉన్న లేఅవుట్‌ను సభాస్థలి కోసం పరిశీలించారు. ముఖ్యమంత్రి రాకపోకలకు అనుగుణంగా నేరుగా విష్ణు కాలేజ్ రోడ్డుకు కలిపేలా రోడ్డు నిర్మాణం చేపట్టాలన్నారు. పార్కింగ్ ప్రదేశం, సభకు వచ్చే ప్రజలు, ప్రముఖుల రాకపోకలకు వీలుగా రూట్‌మ్యాప్‌ను సిద్ధం చేయాలన్నారు. హెలీప్యాడ్, సభాస్థలి భారీ కేడింగ్ ఏర్పాట్లను పటిష్టంగా చేయాలని ఆర్‌అండ్‌బి అధికారికి సూచించారు. హెలీప్యాడ్ ప్రదేశంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నిర్ణీత సమయంలో ఏర్పాట్లను పక్కాగా పూర్తిచేసి ముఖ్యమంత్రి పర్యటన విజయవంతానికి అధికారులు కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్‌పి యు.రవిప్రకాష్, ఆర్‌డిఒ కె.శ్రీనివాసులురాజు, ఆర్‌అండ్‌బి జిల్లా అధికారి బి.లోకేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ బి.శ్యామల, డిఎస్‌పి బి.శ్రీనాథ్, డిఎంహెచ్‌ఒ డాక్టర్ డి.మహేశ్వర రావు, జిల్లా అగ్ని మాపక దళ అధికారి బి.శ్రీనివాస రావు, విద్యుత్ శాఖ ఇఇ ఫీర్ అహ్మద్‌ఖాన్, తహశీల్దార్ వై.రవికుమార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు

సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలి

ముఖ్యమంత్రి జిల్లా పర్యటన ఏర్పాట్లను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలని కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో సిఎం పర్యటనకు వివిధ శాఖల అధికారులు చేపట్టాల్సిన ఏర్పాట్లపై ఆమె సమీక్షించారు. సమీక్షలో జిల్లా ఎస్‌పి యు.రవిప్రకాష్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. హెలీప్యాడ్ దగ్గర సిఎం దిగినప్పటి నుండి తిరుగు ప్రయాణం వరకు అన్ని ఏర్పాట్లూ పకడ్బందీగా ఉండాలని కలెక్టర్ అన్నారు. హెలీప్యాడ్ నుండి బివి.రాజు సర్కిల్, బైపాస్ మీదుగా సభా వేదిక వరకూ సుమారు రెండు కిలోమీటర్లు ముఖ్యమంత్రి రోడ్‌షో ఉంటుందన్నారు. ఎస్‌పి రవిప్రకాష్ మాట్లాడుతూ బందోబస్తుకు అవసరమైన సిబ్బందిని సిద్ధం చేసినట్లు తెలిపారు. సమావేశంలో ఎఎస్‌పి ఎవి.సుబ్బరాజు, డిఆర్‌ఒ బి.శివన్నారాయణరెడ్డి, ఆర్‌డిఒలు కె.శ్రీనివాసులురాజు (భీమవరం), ఎం.అచ్యుత్‌అంబరీష్ (నరసాపురం), కె.చెన్నయ్య (తాడేపల్లిగూడెం), డిఎస్‌పి బి.శ్రీనాథ్, అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ ఆదా చేసే గృహోపకరణాలపై అవగాహన అవసరం

ఎపి స్టేట్‌ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్ ప్రాజెక్ట్ మేనేజర్ (విజయవాడ) జి.సుమంత్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

విద్యుత్‌ను పొదుపు చేసే గృహోపకరణాలపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్‌ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్ ప్రాజెక్ట్ మేనేజర్ (విజయవాడ) జి.సుమంత్ సూచించారు. స్థానిక ఎపి నిట్‌లోని ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం, ఆంధ్రప్రదేశ్ స్టేట్‌ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రమాణాలు అండ్ లేబులింగ్ అనే అంశంపై బుధవారం శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎపి నిట్ డీన్ అకడమిక్ డాక్టర్ టి.కురుమయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సుమంత్ మాట్లాడుతూ ఎసి, ఫ్రిజ్, టీవీ, ప్రింటర్, కంప్యూటర్లకు స్టార్ రేటింగ్ కలిగిన పరికరాలను ఉపయోగించడం ద్వారా విద్యుత్ ఆదా చేసుకోవచ్చని తెలిపారు. 4, 5 స్టార్ రేటింగ్ కలిగిన ఎల్ఇడి బల్బులను వినియోగించడం ద్వారా 30 నుంచి 50 శాతం వరకు విద్యుత్‌ను ఆదా చేసుకోవచ్చని వివరించారు. సిరి ఎనర్జీ అండ్ కార్బన్ అడ్వయిజరీ సర్వీసెస్ ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీ (హైదరాబాద్) డైరెక్టర్ జి.సుబ్రమణ్యం మాట్లాడుతూ విద్యుత్‌ను పొదుపు చేసేందుకు అత్యుత్తమమైన ఇంధన సామర్థ్యం కలిగిన గృహోపకరణాలను ఉపయోగించాలని సూచించారు. నాణ్యమైన విద్యుత్ ఉపకరణాల వినియోగాన్ని ప్రభుత్వాలు సైతం ఎంతగానో ప్రోత్సహిస్తున్నాయని చెప్పారు. విద్యుత్‌ను ఆదా చేసి రాబోయే తరాలకు భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని వివరించారు. ఎనర్జీ ఎక్స్‌పర్ట్ అక్రిటేటెడ్ ఎనర్జీ ఆడిటర్ (హైదరాబాద్) ఐవి.రమేష్‌కుమార్ మాట్లాడుతూ విద్యుత్‌ను పొదుపు చేసి భవిష్యత్తు తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. అనంతరం విద్యుత్‌ను ఎలా ఆదా చేయాలనే విషయాలను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమానికి ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ తేజావత్ రమేష్, ఆచార్యుడు డాక్టర్ పెద్దపాటి శంకర్ కోఆర్డినేటర్లుగా వ్యవహరించారు. విద్యుత్‌పై క్విజ్ పోటీలను నిర్వహించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 15 మంది విద్యార్థులకు స్మార్ట్ ఎల్ఇడి బల్బులు, ధ్రువపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆచార్యులు డాక్టర్ వి.సందీప్, డాక్టర్ శ్రీ ఫణికృష్ణ, ఎనర్జీ ఇంజినీర్లు వినోద్‌బాబు, భారత్‌కుమార్‌తోపాటు నిట్, శశి, వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలకు చెందిన 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సుమంత్

పరిశ్రమల స్థాపనకు యువత అడుగులేయాలి

ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలి

కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

ఫుడ్ ప్రాసెసింగ్, పరిశ్రమల స్థాపనకు యువత, ఔత్సాహికులు అడుగులు వేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను యువతీ, యువకులు సద్వినియోగం చేసుకుని ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలని సూచించారు. తణుకు ఇండస్ట్రియల్ ఎస్టేట్లో ఎంఎస్ఇసి డిపి స్కీమ్ కింద రూ.9.87 కోట్లు మౌలిక సదుపాయాల కల్పనకు ముఖ్యమంత్రి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. దీనిలో భాగంగా బుధవారం స్థానిక కలెక్టరేట్లో శిలాఫలకాన్ని (ఫ్లెక్సీస్టాండు) కలెక్టర్ పి.ప్రశాంతి, తణుకు ఇండస్ట్రియల్ ఎస్టేట్ ప్రెసిడెంట్ వంకా రాజకుమారి సంయుక్తంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఫుడ్ ప్రాసెసింగ్, పరిశ్రమల స్థాపనకు అందిస్తున్న ప్రోత్సాహకాలను యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. పరిశ్రమల స్థాపనకు రాష్ట్ర ప్రభుత్వం మంచి ప్రోత్సాహంతోపాటు సింగిల్ విండో ద్వారా ఒక్క రోజులోనే అనుమతులను మంజూరు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉభయ గోదావరి జిల్లాల ఎపిఐఐసి జోనల్ మేనేజర్ కె బాబ్జీ, డిప్యూటీ జోనల్ మేనేజర్ వైవికె.సుబ్బారావు, ఇండస్ట్రియల్ ప్రమోషన్ అధికారి జె.పతి, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

శిలాఫలకాన్ని ఆవిష్కరించిన కలెక్టర్

పంట విరామమే శరణ్యం

ఆక్వా రైతు నేత సూర్యనారాయణరాజు

ఉండి: రాష్ట్ర ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలు ఆక్వా రైతులను నట్టేట ముంచాయని, పంట విరామమే తమకు శరణ్యమని ఆక్వా రైతు రాష్ట్ర కమిటీ సభ్యులు రుద్రరాజు సూర్యనారాయణరాజు (యువరాజు) అన్నారు. బుధవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ సబ్సిడీ విషయంలో తీసుకున్న అనాలోచిత నిర్ణయం కారణంగా ఆక్వా రైతులు సాగు వదిలేసి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖాధికారులు అర్హతున్నా తనకు సంవత్సరంపాటు సబ్సిడీ రాకుండా అడ్డుకున్నారని, గత ఐదు నెలల బిల్లుకు సంబంధించి 42 వేల యూనిట్ల విద్యుత్‌కు రూ.లక్షా 65 వేలు బిల్లు చెల్లించాల్సిందిగా నోటీసులు ఏ విధంగా పంపారని ప్రశ్నించారు. తాను విద్యుత్ సబ్సిడీకి అర్హుడినే అన్న విషయం విద్యుత్ శాఖాధికారులు గుర్తుంచుకోవాలన్నారు. ట్రూఅప్, ఇంధన ఛార్జీల పేరిట 2014-19 మధ్యకాలంలో విద్యుత్ వాడకానికి సంబంధించి ఇప్పుడు వసూలు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే అధికంగా పెరిగిన మేత ధరలు, తగ్గిన మార్కెట్ ధర, నాణ్యత లేని సీడ్‌తో రైతులు సతమతమవుతున్నారని, విద్యుత్ శాఖాధికారుల వేధింపులు తాళలేక ఆక్వా సాగుకు రైతులు దూరమవుతున్నారని సూర్యనారాయణరాజు ఆవేదన వ్యక్తం చేశారు.

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

డిఇఒకు నేతల వినతి

వినతి అందజేస్తున్న యుటిఎఫ్ నేతలు

భీమవరం: జిల్లాలో మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి డిమాండ్ చేశారు. డిఇఒ ఆర్.వెంకటరమణకు మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలపై యుటిఎఫ్ నేతలు బుధవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గోపీమూర్తి మాట్లాడుతూ 2022 జూన్‌లో మున్సిపల్ ఉపాధ్యాయుల సర్వీసులు మున్సిపల్ యాజమాన్యం నుండి పాఠశాల విద్యాశాఖ పర్యవేక్షణకు వచ్చాయన్నారు. ఈ నేపథ్యంలో యుటిఎఫ్ కృషి వల్ల సేవా పుస్తకాలు, కేడర్ స్ట్రెంగ్త్ సమస్యలు పరిష్కారమయ్యాయన్నారు. బదిలీలు, ప్రమోషన్లు చేపట్టలేదని, ప్రభుత్వ, పంచాయతీరాజ్ ఉపాధ్యాయులతో సమానంగా బదిలీలు, ప్రమోషన్లు అప్‌గ్రేడ్ చేస్తామని ఇచ్చిన హామీ నెరవేరలేదని గుర్తు చేశారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విద్యాశాఖాధికారులను కోరినా ఇప్పటి వరకూ ఎటువంటి చర్యలూ తీసుకోలేదన్నారు. విద్యాశాఖ నిర్లక్ష్యం కారణంగా సమస్యలు పరిష్కారం కాలేదని, ఇప్పటికైనా బదిలీలు, ప్రమోషన్లు తక్షణం నిర్వహించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో అన్ని పోస్టులూ అప్‌గ్రేడ్ చేయాలన్నారు. పిఎఫ్ సౌకర్యం వెంటనే కల్పించాలన్నారు. బోధనేతర సిబ్బందిని నియమించడంతోపాటు భవనాల అద్దె, కరెంట్ బిల్లులు చెల్లించాలని, అన్ని రకాల బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పిఎస్.విజయరామరాజు, ఎకెవి.రామభద్రం, నేతలు పాల్గొన్నారు.

సంపదను పంచేది జగన్.. దోచింది చంద్రబాబు

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

ప్రజాశక్తి - యలమంచిలి

రాష్ట్ర సంపదను పేదలకు పంచే వ్యక్తి జగన్మోహన్‌రెడ్డి అయితే, గతంలో రాష్ట్ర సంపదను దోచిన వ్యక్తి చంద్రబాబు అని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరు వెంకట నాగేశ్వరరావు ఘాటుగా విమర్శించారు. మండలంలోని కట్టుపాలెం, దొడ్డిపట్ల, మట్లపాలెం గ్రామాల్లో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాలు, రైతుభరోసా కేంద్రాలను ఆయన బుధవారం చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, వైసిపి పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపీతో కలిసి ప్రారంభించారు. అనంతరం యలమంచిలిలో శ్రీ ఉమా నరసింహ కళ్యాణ మండపంలో నిర్వహించిన సభలో మంత్రి మాట్లాడుతూ పేదలకు అండగా ఉంటున్న వైసిపి ప్రభుత్వంపై అక్కసుతో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు, అతని కుమారుడు లోకేష్, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ అసత్య ఆరోపణలు చేస్తూ పబ్బం గడుపుకుంటున్నారన్నారు. అయితే వీరెవరినీ ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రావూరి వెంకటరమణబుజ్జి, వైసిపి మండల కన్వీనర్ పొత్తూరి బుచ్చిరాజు, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా

శివరామరాజుకు వెన్నుపోటు పొడిచి ఎంఎల్ఎ కాలేదా

కరోనా సమయంలో ఆక్వా రైతులను మోసగించలేదా

ఉండి ఎంఎల్ఎపై పివిఎల్ విమర్శలు

ప్రజాశక్తి - ఉండి

ఉండి నియోజకవర్గంలోని 73 గ్రామాల్లో అభివృద్ధిపై చర్చకు సిద్ధమని డిసిసిబి ఛైర్మన్, వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహరాజు ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజుకు సవాల్ విసిరారు. బుధవారం ఉండి సచివాలయం-4 పరిధిలో నిర్వహించిన 'గడపగడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో పివిఎల్ మాట్లాడారు. కరోనా సమయంలో ప్రజలకు అండగా ఉండాల్సిన ఎంఎల్ఎ ఏలూరుపాడులో రొయ్యల షెడ్డు పెట్టుకుని పదవిని అడ్డం పెట్టుకుని వ్యాపారం చేసుకుంటూ ఆక్వా రైతులను నిలువునా మోసం చేసి కోట్లాది రూపాయలు సంపాదించ లేదా అని ప్రశ్నించారు. చంద్రబాబు మాదిరిగా రామరాజు మాజీ ఎంఎల్ఎ శివరామరాజు వెన్నంటే ఉండి నమ్మక ద్రోహం చేసి వెన్నుపోటు పొడిచిన తీరు అందరికీ తెలుసని విమర్శించారు. పండుగ సమయాల్లో నలుగురికి మంచి చేయాల్సిన ఎంఎల్ఎ కోడిపందేల బరిపెట్టి కేబుల్ తీసుకుంటూ వ్యాపారం చేసుకోవట్లేదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంఎల్ఎ పదవిని అడ్డం పెట్టుకొని ఏలూరుపాడులో అక్రమ అనుమతులతో వ్యాపారం చేస్తున్న సంగతి తనకు తెలుసని, అధికారులు ఎలా అనుమతిచ్చారో త్వరలో బయటపెడతానని అన్నారు. ఐస్ ఫ్యాక్టరీ ముసుగులో ఎంఎల్ఎ రొయ్యల వ్యాపారం చేస్తున్నారని, ఈ ఫ్యాక్టరీ వల్ల దిగువన ఉన్న వేలాది ఎకరాల్లో వరి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారనే విషయం తెలుసుకోవాలని సూచించారు. నియోజకవర్గంలో సుమారు రూ.50 కోట్ల మేర అభివృద్ధి పనులు చేయడమే కాకుండా 'గడపగడపకూ మన ప్రభుత్వం' ద్వారా ఇప్పటి వరకు రూ.11.40 కోట్లు సచివాలయాల అభివృద్ధికి కేటాయించారన్నారు. కలవపూడిలోనే రూ.96.30 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టామనే విషయాన్ని ఎంఎల్ఎ తెలుసుకోవాలని సూచించారు. 73 గ్రామాల్లో ఏ గ్రామంలోనైనా అభివృద్ధి పనులపై బహిరంగ చర్చకు సిద్ధమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి కమతం సౌజన్య బెనర్జీ, ఉపసర్పంచి గొట్టుముక్కల కళ్యాణ్‌వర్మ, ఎంపిపి శ్రీహరి నారాయణరాజు, నేతలు గులిపల్లి అచ్చారావు, కరిమెరక మల్లికార్జున, రణస్థల మహంకాళి, గుండాబత్తుల సుబ్బారావు, బడుగు బాలాజీ, అంగర రాంబాబు, శేషాద్రి శ్రీనివాస్, రాయి సతీష్, బులుసు వెంకట రామకృష్ణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పివిఎల్.నరసింహరాజు

భీమవరంలో ఇడి సోదాల కలకలం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఛాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షులు మానేపల్లి సూర్యనారాయణగుప్త నివాసంలో బుధవారం ఇడి అధికారులు సోదాలు నిర్వహించారు. ఈ విషయం పట్టణంలోని పలువురు బడా వ్యాపారుల్లో కలకలం సృష్టించింది. అయితే గుప్తా గతంలో తమ వ్యాపారాలు చూపించి పలు బ్యాంకుల్లో పెద్ద మొత్తంలో రుణాలు తీసుకున్నట్లు పలు బ్యాంకుల పేరిట ప్రకటనలు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే ఇడి అధికారులు గుప్తా నివాసంలో సోదాలు చేయడం కలకలం సృష్టించింది. దీనిపై వివరాలు వెల్లడించేందుకు ఇడి అధికారులు నిరాకరించారు.

మౌలిక వసతుల కల్పనకు చర్యలు

హౌసింగ్ పీడీ ఆనంద్‌కుమార్

లేఅవుట్‌ను పరిశీలిస్తున్న హౌసింగ్ పీడీ

ప్రజాశక్తి - పాలకోడేరు

జిల్లాలోని జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టినట్లు జిల్లా గృహనిర్మాణ శాఖాధికారి ఆనంద్‌కుమార్ తెలిపారు. విస్సాకోడేరు పైపుల చెరువు వద్ద ఉన్న జగనన్న కాలనీని విస్సాకోడేరు సర్పంచి బొల్ల శ్రీనివాస్‌తో కలిసి ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో గృహనిర్మాణాలు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. జనవరి నాటికి ఈ నిర్మాణాలు పూర్తి చేసేందుకు లక్ష్యంగా తీసుకున్నామన్నారు. దీనిలో భాగంగా అన్ని జగనన్న కాలనీల్లో మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు. సర్పంచి బొల్ల శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామానికి చెందిన 163 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చామన్నారు. లబ్ధిదారులు ఇప్పటికే ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నారన్నారు. ఇళ్ల నిర్మాణం వేగవంతంగా జరిగేందుకు అధికారుల సహకారంతో కృషి చేశామన్నారు. ముఖ్యంగా లేఔట్‌లో ఉన్న లబ్ధిదారులకు పంచాయతీ నుంచి విద్యుత్ సరఫరాకు ఇప్పటికే చర్యలు చేపట్టామన్నారు. లేఔట్‌ను పరిశీలించిన వారిలో హౌసింగ్ ఇఇ రమణ, డిఇ శివరామరాజు, డిఇ ప్రసాద్, ఎఇ నరసింహారావు, పంచాయతీ కార్యదర్శి జాజి ప్రసాద్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ చైతన్య ఉన్నారు.

మొగల్తూరు: ఇళ్ల నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి విజయలక్ష్మి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ భవనంలో బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డిఇ వెంకటేశ్వరరావు, ఎంపిడిఒ ఉండ్రు బాబ్జీరాజు, ఇఒపిఆర్‌డి మేడిది నవీన్‌కిరణ్, హౌసింగ్ ఎఇ ఫణీంద్ర పాల్గొన్నారు.

సదరం ధ్రువపత్రాల పరిశీలన

ప్రజాశక్తి - భీమవరం

సదరం ధ్రుపత్రాల పరిశీలన కార్యక్రమం డిసెంబర్ 1,2 తేదీలలో నిర్వహించనునట్లు డిఇఒ ఆర్.వెంకటరమణ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విభిన్నప్రతిభావంతులు సదరం ధ్రువపత్రాలను పరిశీలన నిమిత్తం తీసుకురావాలని సూచించారు. పాఠశాలల వారీగా పరీక్షలకు హాజరయ్యే విభిన్నప్రతిభావంతుల పూర్తి వివరాలతోపాటు సదరం ధ్రువపత్రాలను భీమవరం పిఎస్ఎం బాలికోన్నత పాఠశాల ఆవరణలో డిసెంబరు 1, 2 తేదీల్లో నిర్వహించే ప్రత్యేక కేంద్రానికి తీసుకురావాలని పేర్కొన్నారు.

జగన్ పాలనలో ప్రతి గడపకూ లబ్ధి : చీఫ్‌విప్ ప్రసాదరాజు

ప్రజాశక్తి - నరసాపురం

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి గడపకూ లబ్ధి చేకూరిందని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు తెలిపారు. పట్టణంలో కోట వద్ద పాలెం కొండామ్మ గుడి వద్ద నాలుగో సచివాలయం పరిధిలో 8, 9వ వార్డులకు సంబంధించి బుధవారం జరిగిన వై ఎపి నీడ్ జగన్ కార్యక్రమానికి ముదునూరి ప్రసాదరాజు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ప్రతి గడపగడపకూ లబ్ధి చేకూర్చారన్నారు. ప్రజలకు మంచి చేస్తున్నామనే ధైర్యంగా ప్రజల్లోకి వెళ్లి అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించామని చెప్పగలుగుతున్నామన్నారు. ముందుగా 8, 9వ వార్డుల్లో నాలుగున్నరేళ్లలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ ప్రగతి డిస్ప్లే బోర్డును ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్ పర్సన్ బర్రె శ్రీ వెంకటరమణ, మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు బర్రె జయరాజు పాల్గొన్నారు.

ఆచంట : పేదరిక నిర్మూలనే లక్ష్యంగా అభివృద్ధి సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కుతుందని ఎఎంసి ఛైర్మన్ చిల్లే లావణ్య అన్నారు. రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలిలో భాగంగా బుధవారం భీమలాపురం వైసిపి ఇన్‌ఛార్జి మొల్లేటి రామకృష్ణ అధ్యక్షతన గ్రామ సచివాలయ కార్యాలయం వద్ద 'మా నమ్మకం నువ్వే జగన్' డిజిటల్ బోర్డు ప్రారంభించి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఎన్నడూ లేని విధంగా భీమలాపురం గ్రామంలోని రూ.7.17 కోట్లతో పేదలకు సంక్షేమ పథకాలను అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు జక్కంశెట్టి చంటి, సచివాలయ మండల కన్వీనర్ తమరాడ చంద్రశేఖర్, ముత్యాల నాగేశ్వరరావు, నాని, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మొగల్తూరు : మాట్లాడుతున్న ప్రభుత్వ చీఫ్‌విప్ ప్రసాదరాజు

పేద రైతులకు పట్టాలిచ్చి వారి జీవితాల్లో వెలుగులు నింపిన ఏకైక ముఖ్యమంత్రి జగన్ అని ఎఎంసి ఛైర్మన్ చిల్లే లావణ్య, సర్పంచు ఛాంబర్ అధ్యక్షులు సుంకర సీతారామ్ స్పష్టం చేశారు. బుధవారం పెదమల్లంలో సర్పంచి దిరిశాల విజయలక్ష్మి అధ్యక్షతన రాష్ట్రానికి జగన్ ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. సుంకర సీతారామ్ మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుకుని ప్రభుత్వాన్ని విమర్శిస్తున్న వారు ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి డైరెక్టర్ కొండేటి భవానీప్రసాద్, నక్కా శ్రీను, మోహన్ పాల్గొన్నారు.

మొగల్తూరు : వైసిపి పాలనలో రాష్ట్రంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాద రాజు అన్నారు. కాళీపట్నం పడమర గ్రామ సచివాలయం వద్ద బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వానికి, ఈ ప్రభుత్వానికి తేడా చూడాలన్నారు. గడిచిన నాలుగున్నరేళ్లలో రూ.33.48 కోట్లు ఈ ఒక్క సచివాలయం పరిధిలో అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఖర్చు చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో రోడ్లు, తాగునీటి పనులకు పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. ముందుగా ప్రగతి డిస్ప్లే బోర్డును ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపిలు కవురు సాంబశివరావు, కైలా సుబ్బారావు, సర్పంచి కవురు సావిత్రి ఆదినారాయణ పాల్గొన్నారు.

పోడూరు : రానున్న రోజుల్లో ప్రజలు ప్రతి ఒక్కరూ అండగా ఉండాలని డిసిసిబి డైరెక్టర్ పివిఎల్ నరసింహరాజు అన్నారు. కుముదవల్లిలో సర్పంచి భూపతిరాజు వంశీకృష్ణమరాజు ఆధ్వర్యంలో రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి జెండాను, సంక్షేమ బోర్డును పివిఎల్ ఆవిష్కరించి మాట్లాడారు. సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందించిన ఘనత వైసిపికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు సత్తిబాబు, అబ్బులు పండు పాల్గొన్నారు.

తాగునీరందించాలని వినతి

ప్రజాశక్తి - పెనుగొండ

పెనుగొండలోని కోడిపందేలదిబ్బలో పది రోజులుగా వాటర్ ట్యాంకు రావడం లేదని, దీంతో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని ఆ కాలనీ వాసులు ఎంపిడిఒ శ్రీనివాస్ దొరకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాదాసు నాగేశ్వరరావు మాట్లాడారు. ఈ కాలనీలో 500 కుటుంబాలు నివసిస్తున్నాయని, వెంటనే తాగునీరు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా'కు పేర్లు నమోదు చేసుకోవాలి

వీరవాసరం: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా నిర్వహించనున్న క్రీడా పోటీలకు 15 ఏళ్ల నిండిన ఆసక్తి గల బాలబాలికలు పేర్లు నమోదు చేసుకోవాలని ఎంపిడిఒ జ్యోతి బుధవారం తెలిపారు. ప్రతి సచివాలయం పరిధిలో రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయన్నారు. ఆదేవిధంగా వెబ్‌సైట్‌లో కూడా నమోదు చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఖోఖో, క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, బాడ్మింటన్ క్రీడలు నిర్వహిస్తారన్నారు.

శుద్ధి చేసిన నీటిని తాగాలి

ఆచంట (పెనుమంట్ర): శుద్ధి చేసిన నీటిని తాగడం వల్ల అంటు వ్యాధులు దరి చేరవని నెగ్గిపూడి సర్పంచి మామిడిశెట్టి ధనలక్ష్మి అన్నారు. గ్రామ పంచాయతీ వద్ద బుధవారం ఆర్‌ఒ ప్యూరిఫైడ్ మినరల్ వాటర్ యూనిట్‌ను వాటి వెంకట శ్రీనివాసరెడ్డి ప్రోత్సాహంతో, విరిడెక్స్ యానిమల్ హెల్త్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ రీజనల్ బిజినెస్ మేనేజర్ ఎవి సత్యనారాయణ, సర్పంచి ధనలక్ష్మి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ బిజినెస్ మేనేజర్ టి.దామోదర్‌రావు, బిజినెస్ ఆఫీసర్ లక్ష్మీ నగేష్, అల్లం బుల్లిరెడ్డి పాల్గొన్నారు.

అప్రోచ్ రోడ్డుకు శంకుస్థాపన

పోడూరు: మండలంలోని మినిమించిలిపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని పెదపేట శ్మశానవాటిక అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి బుధవారం ఎంపిపి సబ్బితి సుమంగళి శంకుస్థాపన చేశారు. దాదాపు రూ. 3 లక్షల ఎంపిపి నిధులతో ఈ రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్టు సర్పంచి రామన వీర్రాజు తెలిపారు. ఈ రోడ్డు నిర్మాణానికి కృషి చేసిన ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథ రాజుకు ఎంపిపి సబ్బితి సుమంగళికి పెదపేట ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆచంట ఎఎంసి వైస్ ఛైర్మన్ గుబ్బల వీరబ్రహ్మం, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై విద్యార్థులకు అవగాహన

భీమవరం : కెజిఆర్ఎల్ కళాశాలలో ప్రపంచ ఎయిడ్స్ డే వారోత్సవాల సందర్భంగా అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో ఎయిడ్స్ డేను పురస్కరించుకుని కృష్ణా యువజన సంక్షేమ సంఘం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. సుమారు 100 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మేనేజర్ రవికిరణ్ మాట్లాడుతూ ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా డిసెంబర్ 1వ తేదీన జరిగే ర్యాలికి విద్యార్థులందరూ తరలి రావాలని కోరారు.

పాలకొల్లు : ఎంఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ టి.రాజరాజేశ్వరి అధ్యక్షతన ఎయిడ్స్ డేను పురస్కరించుకుని బుధవారం మహిళా సాధికారిత విభాగం, ఆర్ఆర్‌సి క్లబ్, హెల్త్ సెంటర్ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని ఫెమినా లయన్స్ క్లబ్ వారు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన శేషాద్రి హాస్పిటల్ గైనకాలజిస్ట్ సుజయశ్రీ ఎయిడ్స్ వైరస్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రెసిడెంట్ నాయని సూర్యకుమారిపాల్గొన్నారు.

ఎవరెస్ట్‌ను అధిరోహించిన దాసు

పోడూరు: పాలకొల్లు మండలం లంకలకోడేరు గ్రామానికి చెందిన యువకుడు గోగులమండ దాసు నేపాల్‌లోని మౌంట్ ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించి, ఎవరెస్ట్ శిఖరంపై భారత జాతీయ పతాకాన్ని ఎగురవేసి తెలుగోడి సత్తా చాటారు. ఈ సందర్భంగా గోగులమండ దాసు మాట్లాడుతూ ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించాలనేది తన ఆశయమని తెలిపాడు. ఈ ఆశయాన్ని నెరవేర్చుకోవడానికి ఆర్థిక స్థోమత సరిపోక ఆచంట ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజును కలిశానని, ఆయన సానుకూలంగా స్పందించి ఆర్థిక సహాయం చేశారని తెలిపారు. ఆయన ఆర్థిక సహాయంతో ఎవరెస్ట్ బేస్ క్యాంప్ 5364 మీటర్లు, మౌంట్ కలాపత్ 5,555 మీటర్లు గల ఎవరెస్ట్ శిఖరాన్ని మైనస్ 20 డిగ్రీల చలిలో అధిరోహించి తన ఆశయాన్ని నెరవేర్చుకున్నానని తెలిపారు. సహకరించిన ఎంఎల్ఎకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని తెలిపారు.

వాహనదారులు హెల్మెట్ ధరించాలి

పాలకొల్లు రూరల్: వాహనదారులు తప్పక హెల్మెట్ ధరించాలని డిఎస్‌పి పైడేశ్వరరావు తెలిపారు. దిగుమర్రు బైపాస్ వద్ద ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్‌పై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి, కుటుంబ సభ్యులకు భరోసా ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ సిఐ కుడిపూడి శ్రీనివాస్, ఎస్ఐ ఎస్.శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

'జనసేన బలోపేతానికి కృషి చేయాలి'

కాళ్ల: జనసేన బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పార్టీ మండల అధ్యక్షులు ఎరుబండి రామాంజనేయులు అన్నారు. రాష్ట్ర పిఎసి సభ్యులు కనకరాజు సూరి, జిల్లా అధ్యక్షులు గోవిందరావు ఆదేశాల మేరకు జనసేన ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు నుంచి మేకా కాళీ చరణ్ (మహంకాళి) పార్టీ మండల యూత్ అధ్యక్షుల నియామక పత్రాన్ని బుధవారం అందుకున్నారు. ఈ సందర్భంగా కాళీ చరణ్ మాట్లాడుతూ పార్టీ ఆశయాలను, సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి బలోపేతానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు ఇర్రింకి జగన్, ఆరేటి దిలీప్, అంబళ్ల వెంకటరమణ, చిన్నయ్య, వెంకటేష్, దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

శశి విద్యార్థుల ప్రతిభ

తాడేపల్లిగూడెం: జెఎన్‌టియు విశ్వవిద్యాలయం జట్టుకు శశి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు బి.హితీష్ బాల కార్తికేయ వాలీబాల్ టీంకు, యు.యశస్విని నెట్‌బాల్ టీంకు ఎంపికైనట్టు కళాశాల యాజమాన్యం బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. డిసెంబర్ 22 నుంచి 25వ తేదీల్లో కర్ణాటక రాష్ట్రం బెలగావిలోని విశ్వేశ్వరయ్య టెక్నాలజీ యూనివర్సిటీలో జరిగే ఆల్ ఇండియా యూనివర్సిటీ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల ఛైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ, వైస్ ఛైర్మన్ మేకా నరేంద్రకృష్ణ, ప్రిన్సిపల్ మహమ్మద్ ఇస్మాయిల్ తదితరులు అభినందించారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలకు 30 మంది ఎంపిక

భీమవరం రూరల్: డిఎన్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో నివా బుపా కంపెనీ నిర్వహించిన కాంపస్ ఇంటర్వ్యూల్లో 30 మంది ఎంపికైనట్లు కళాశాల సెక్రటరీ గాదిరాజు సత్యనారాయణ రాజు (గాదిరాజు బాబు) తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన 30 మంది విద్యార్థులకు యాజమాన్యం శుభాకంక్షాలు తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ ఎం.అంజన్‌కుమార్ మాట్లాడారు. ఈ ప్రాంగణ ఎంపికల్లో ఎంతో మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని తెలిపారు. ప్లేస్‌మెంట్ డైరెక్టర్ సిహెచ్.రాంకిషోర్ మాట్లాడారు. త్వరలో వివిధ దేశీయ, బహుళ దేశీయ సంస్థల క్యాంపస్ రిక్రూట్మెంట్ డ్రైవ్‌లను నిర్వహించనున్నామని తెలిపారు.

హత్య కేసులో ముగ్గురు అరెస్టు

భీమవరం రూరల్ : ఆస్తికోసం సొంత పెద్దమ్మకు విషం ఇచ్చి హత్య చేసిన వ్యక్తితో పాటు మరో ఇద్దరిని అరెస్టు చేసినట్లు రూరల్ సిఐ వై.సత్యకిషోర్ తెలిపారు. బుధవారం రూరల్ పోలీస్ స్టేషన్లో విలేకరులకు ఆయన వివరాలు వెల్లడించారు. మండలంలోని తోకతిప్పకు చెందిన ఆంథ్రాజు మద్దూరికి ముగ్గురు చెల్లెళ్లు ఉన్నారు. అయితే వీరి నలుగురికి తల్లిదండ్రులు ఒక్కో సెంటు చొప్పున నాలుగు సెంట్లు ఇచ్చారు. అయితే మద్దూరి రెండో చెల్లెలు కొడుకు రామని నాగార్జున నిడమర్రులో ఉంటున్నాడు. ఆ స్థలాన్ని నాగార్జున మూడేళ్ల క్రితం వారి నుంచి కొనుగోలు చేశాడు. అయితే సెంటు రూ.70,000 ధర లెక్కన పెద్దమ్మకు, పిన్నిలకు మూడు సంవత్సరాల క్రితమే డబ్బులు ఇచ్చేశాడు. అయితే మద్దూరి ఉన్నంతకాలం ఉండి ఆ తర్వాతే స్థలాన్ని నాగార్జున స్వాధీనం చేసుకునేలా బంధువుల సమక్షంలో నిర్ణయించుకున్నారు. అయితే మధ్యానికి బానిసైన నాగార్జున స్థలం ఖాళీ చేయాలని పెద్దమ్మపై ఒత్తిడి తెచ్చాడు. ఆమె ఖాళీ చేయకపోవడంతో కక్షగట్టాడు. ఈ నెల 24న నాగార్జున, స్నేహితులు మింద్యాల ఏసుబాబు, నక్కా ఏసుబాబుతో కలిసి కొంగలు మందును కూల్ డ్రింక్‌లో కలిపి ఆమెకు పట్టించారు. ఆమె కేకలు వేయడంతో నాగార్జున పరారయ్యాడు. విషయం మద్దూరి ఇటు పక్క వారికి చెప్పడంతో హాస్పిటల్‌కు తీసుకెళ్లేలోపు ఆమె మృతి చెందింది. ఈ ఘటనపై విచారణ చేపట్టి ముద్దాయిలను ఈ నెల 28న నిడమర్రులో అదుపులోకి తీసుకున్నట్లు సిఐ తెలిపారు. అతని నుంచి పల్సర్ బైకు, స్థలం పత్రాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ బి.మోహన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ఫిర్యాదులపై ఆర్‌డిఒ పరిశీలన

ప్రజాశక్తి - వీరవాసరం

మండలంలో పలు ఫిర్యాదుల మేరకు భీమవరం ఆర్‌డిఒ శ్రీనివాసులురాజు క్షేత్రస్థాయిలో పరిశీలించి తహశీల్దార్ సుందరరాజుకు ఆదేశాలు జారీ చేశారు. వీరవాసరం పశ్చిమ కాలువ నుంచి సాగునీటి బోదెల వద్ద ఏర్పాటు చేసిన తూరల గురించి రైతులు అభ్యంతరాలపై వచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం ఆయన పరిశీలించారు. ఈ పరిశీలనలో ఆయన ఆక్రమణలు గుర్తించారు. తూరల వల్ల ఎటువంటి ఇబ్బందులూ లేవని గుర్తించారు. ఇరిగేషన్ అధికారులు పరిశీలన తరువాత తదుపరి చర్యలు తీసుకోవాలని తహశీల్దార్‌ను ఆదేశించారు. బాలేపల్లిలో ఒక బోదె పూడుకుపోవడంతో సాగునీరు పారుదలకు ఆటంకంగా ఉందని అందిన ఫిర్యాదు మేరకు ఆర్‌డిఒ పరిశీలించారు. అయితే ఫిర్యాదుదారుడు అందుబాటులో లేడు. బోదె రికార్డుల్లో లేనందున రైతులే దాన్ని బాగు చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఆర్ఐ రోజ్‌వెల్డ్, విఆర్‌ఒలు ఉన్నారు.

ప్రాణహాని ఉంది.. రక్షణ కల్పించండి

గరగపర్రు ఆత్మ గౌరవ ఉద్యమ నాయకులు రత్నం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

గరగపర్రు గ్రామంలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు వ్యతిరేకి అయిన ఇందుకూరి బలరామ కృష్ణంరాజుతో తన కుటుంబానికి ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని గరగపర్రు ఆత్మ గౌరవ ఉద్యమ నాయకులు సిరింగుల వెంకటరత్నం తెలిపారు. బుధవారం భీమవరం చంద్రిక ఫంక్షన్ హాల్లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బలరామ కృష్ణంరాజు ఆనాడు పంచాయతీలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు తీర్మానాన్ని వ్యతిరేకించడంతో ఎంపిటిసిగా ఉన్న నా భార్య స్వరూపరాణి, దళిత సంఘాలు పెద్ద ఎత్తున అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలని ఉద్యమం చేపట్టారన్నారు. ఇదే విషయమై పశ్చిమ బెంగాల్ మాయావతి పార్లమెంట్‌లో మాట్లాడారని, దీంతో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు బలరామ కృష్ణంరాజుతోపాటు మరికొంత మందిని అరెస్ట్ చేశారని తెలిపారు. దీంతో తన కుటుంబంపై కక్షగట్టి తనపై దాడులు చేయిస్తున్నారని విమర్శించారు. దీనిపై ఆకివీడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా 18 మందిపై కేసు నమోదు చేశారని, తక్షణం వారి బెయిల్ రద్దు చేసి అరెస్ట్ చేయాలని కోరారు. రాజులు కక్ష ఎలా ఉంటుందో చూపిస్తానని పదేపదే బెదిరిస్తున్నారని తెలిపాడు. తమకు రక్షణ కల్పించాలని కోరాడు. గంటా సుందర్ మాట్లాడుతూ నాటి ఉద్యమానికి జిల్లాలోని అన్ని దళిత సంఘాలూ మద్దతిచ్చాయన్నారు. నేడు అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు దళిత సంఘాలు ఎందుకు ముందుకు రావడం లేదని ప్రశ్నించారు. వెంకట రత్నం కుటుంబానికి రక్షణ కల్పించాలన్నారు. కార్యక్రమంలో పాలపర్తి జోనా పాల్గొన్నారు.

దళితపేటకు శ్మశానవాటిక కేటాయించాలి

ప్రజాశక్తి - గణపవరం

అర్ధవరం దళితపేటకు ప్రభుత్వం తక్షణం శ్మశానవాటిక కేటాయించాలని కెవిపిఎస్ మండల కార్యదర్శి చిన్నం చిన నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం అర్ధవరం దళితపేటలో జరిగిన సివిల్ రైట్స్ కార్యక్రమంలో పాల్గొన్న నాగేశ్వరరావు మాట్లాడుతూ 1235 జిఒ ప్రకారం దళితులకు శ్మశానవాటిక కేటాయించాలన్నారు. దళితులు సమావేశాలు నిర్వహించడానికి కమ్యూనిటీ హాల్ నిర్మించాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వరరావు, ఎంపిటిసి సుభాష్, గ్రామాభివృద్ధి కమిటీ నాయకులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాల పంపిణీపై తనిఖీ

ప్రజాశక్తి - పాలకొల్లు

జిల్లా ప్రభుత్వ పాఠ్యపుస్తక విక్రయ కార్యాలయం అధికారి టి.భాస్కరరావు బుధవారం పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ తనిఖీలో భాగంగా విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందినవీ, లేనివీ పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థికీ పాఠ్యపుస్తకాలు, వర్క్ బుక్స్ తప్పనిసరిగా అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రాయపూడి భవానీ ప్రసాద్, రిసోర్స్ పర్సన్ రామకృష్ణ పాల్గొన్నారు.

లంకగ్రామాల ప్రజలకు భూహక్కు పత్రాలు అందజేత

ప్రజాశక్తి - ఆచంట

పోడూరు మండలం తూర్పుపాలెం క్యాంపు కార్యాలయంలో పెదమల్లం, అయోధ్యలంక, సిద్ధాంతం లంక గ్రామాలకు చెందిన ఎ, బి క్లాస్ భూహక్కు పట్టాలను బుధవారం ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల కళ్లల్లో ఆనందం చూడడానికి ఈ మహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ సుబ్రహ్మణ్యం, ఆర్ఎస్ జయలలిత పాల్గొన్నారు.

లంకగ్రామాల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారం కోసం ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఎంతో కృషి చేశారని వైసిపి ఇన్‌ఛార్జి ముత్యాల నాగేశ్వరరావు అన్నారు. బుధవారం లంకగ్రామాల ప్రజలకు భూహక్కు పట్టాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆచంట నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎంఎల్ఎ నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. టిడిపి ప్రభుత్వంలో హామీలు తప్ప అభివృద్ధి లేదన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి మొల్లేటి రామకృష్ణ, లబ్ధిదారులు పీతల సత్యనారాయణ, కొప్పాడ రామకృష్ణ, విఆర్ఒ పాల్గొన్నారు.

షటిల్ పోటీల్లో విష్ణు విద్యార్థినుల ప్రతిభ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

జవహర్ లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ కాకినాడ ఆధ్వర్యంలో ఈ నెల 24, 25వ తేదీల్లో ఏలూరులో సిఆర్‌రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన జెఎన్‌టియుకె సెంట్రల్ జోన్ అంతర్ కళాశాలల షటిల్ (మహిళలు) పోటీల్లో భాగంగా విష్ణు ఇంజినీరింగ్ మహిళా కళాశాల విద్యార్థినులు ప్రథమ స్థానం సాధించారని కళాశాల ప్రిన్సిపల్ జి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం కళాశాల ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరాజు, కళాశాల యాజమాన్యం విజేతలు జె.శ్యామల గౌరి, బి.సాయిలక్ష్మిని అభినందించారు. వీరు సౌత్ జోన్ అంతర్ విశ్వవిద్యాలయాల షటిల్ పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటే ఆధారం : తహశీల్దార్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఓటును నిజాయితీతో వేయాలని, ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు ఆధారమని తహశీల్దార్ వై.రవికుమార్ అన్నారు. డిఎన్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో రెవెన్యూ శాఖ, శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఓటు హక్కు వినియోగం, అవగాహన అనే అంశంపై బుధవారం సదస్సు నిర్వహించారు. తహశీల్దార్ రవికుమార్ మాట్లాడుతూ నేటి యువత దేశ భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని ఓటు వేయాలన్నారు. కళాశాల కార్యదర్శి గాదిరాజు సత్యనారాయణ రాజు (బాబు) మాట్లాడుతూ ఓటు హక్కును వినియోగించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అన్నారు. ఉపాధ్యక్షులు గోకరాజు పాండు రంగరాజు, నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ అంజన్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ వర్మ, లైబ్రేరియన్ శిరీష పాల్గొన్నారు.

'వైసిపి హయాంలో ఒరిగిందేమీ లేదు'

నరసాపురం టౌన్ : వైసిపి హయాంలో మత్స్యకారులకు ఒరిగిందేమీ లేదని జనసేన రాష్ట్ర మత్స్యకార వికాస విభాగ సభ్యురాలు తిరుమాని సీతామహాలక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి వాతాడి కనకరాజు, నియోజకవర్గ నాయకులు మైలా వసంతరావు తెలిపారు. వైసిపి నేతల విమర్శలను ఖండిస్తూ పార్టీ మత్స్యకార నాయకులు ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విశాఖ హార్బర్ బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం 80 శాతం ఎక్స్ గ్రేషియా ప్రభుత్వ, మత్స్యకార సంక్షేమం ఖజానాలోంచి తీసి ఇచ్చినవే తప్ప జగన్ తన సొంత డబ్బు ఇవ్వలేదని విమర్శించారు. పవన్ కళ్యాణ్ తన కష్టార్జితాన్ని బోటుకు రూ.50,000 ఇచ్చారని తెలిపారు. వైసిపి నేతలకు మాట్లాడే హక్కుల లేదన్నారు. కార్యక్రమంలో కొల్లాటి ఏసురత్నం, తిరుమాని బాలకృష్ణ పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ స్థలం పరిశీలన

ఆచంట: ఆచంటలో వివిధ కులాలకు కేటాయించిన స్థలాల్లో త్వరితగతిన కమ్యూనిటీ హాల్ నిర్మాణాలు చేపట్టాలని ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు అధికారులను ఆదేశించారు. ఆచంటలోని ఉప్పరలు, దేవాంగులు, నాయీ బ్రాహ్మణులు, విశ్వబ్రాహ్మణులకు కమ్యూనిటీ హాల్ కోసం కేటాయించిన స్థలాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం నటరాజ్ కాలనీలో ఇళ్ల నిర్మాణాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచి కోట సరోజినీ వెంకటేశ్వరరావు, ఉప సర్పంచి అడ్డాల పెద్దిరాజు, వైసిపి నేతలు పాల్గొన్నారు.

స్కూల్ భవన నిర్మాణంపై విచారణ

యలమంచిలి: చించినాడ గ్రామంలో నాడు - నేడులో భాగంగా స్కూలు భవనాన్ని నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్నారని పలువురు గ్రామస్తులు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో బుధవారం సర్వ శిక్ష అభియాన్ డిఇబిహెచ్ శక్తేశ్వరరావు, వర్దనపు వెంకటేశ్వరరావుతో కలిసి బుధవారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారులైన కానేటి బాలరాజు, గొల్ల ఏడుకొండల శ్రీనివాస్, మురాల రాజేష్, చెల్లుబోయిన వడ్డీ కాసులు మాట్లాడుతూ స్కూల్ కమిటీ, స్కూలు ప్రధానోపాధ్యాయిని కలిసి కారు డ్రైవర్‌గా పని చేసే వ్యక్తికి నిబంధనలు విరుద్ధంగా మేస్త్రీ పని కట్టబెట్టారని తెలిపారు. ఆయన స్లాబ్ వేసిన 12 రోజులకే సెంట్రింగ్ తొలగించారని, నిబంధనల ప్రకారం స్లాబు వేసిన 21 రోజుల వరకూ సెంట్రింగ్ ఉంచాల్సి ఉండగా ఆయన 12 రోజులకే తొలగించారని తెలిపారు. భవనం నిర్మాణంలో ఉండగానే ఒకవైపు గోడలు బీటలు వారుతున్నాయన్నారు. దీనిపై డిఇ శక్తేశ్వరరావు మాట్లాడుతూ విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని తెలిపారు. వారి వెంట ఇంజినీరింగ్ అసిస్టెంట్ మురళీకృష్ణ, వెల్ఫేర్ అసిస్టెంట్ సత్యనారాయణ ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాలకోడేరు : 33/11 కెవి గొరగనమూడి సబ్‌స్టేషన్ మరమ్మతుల నిమిత్తం గురువారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు భీమవరం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పీర్ అహ్మద్ ఖాన్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విస్సాకోడేరు, పెన్నాడ, గొరగనమూడి, శృంగవృక్షం, వేంద్ర, కొండేపూడి గ్రామాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

వృద్ధులకు పండ్లు పంపిణీ

పాలకొల్లు : మత్తె విజయ్‌బాబు 14వ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని రాహుల్ వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు, రొట్టెలు బుధవారం పంపిణీ చేశారు. మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు నన్నేటి పుష్పరాజ్ తన మేనమామ మత్తే విజయ్ బాబు వర్ధంతి సందర్భంగా విజయబాబు కుమార్తెలు ఏర్పాటుచేసిన పండ్లు, రొట్టెలను పంపిణీ చేశారు. పుష్ప రాజ్ మాట్లాడారు. కార్యక్రమంలో భావన, సూర్య కళ, సంసాని దివ్య, సుమ పాల్గొన్నారు.

రామం ఆశయ సాధనకు కృషి చేస్తాం

ప్రజాశక్తి - పోడూరు

ఉద్దరాజు రామం ఆశయాలను సాధిస్తామని సిపిఎం మండల కార్యదర్శి పిల్లి ప్రసాద్ అన్నారు. రామం వర్ధంతి సభ మండల కార్యాలయంలో బుధవారం జరిగింది. ముందుగా ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ పేద బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం రామం కృషి చేశారన్నారు. వారి ఆశయ సాధనకై ప్రయత్నం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.మోజెష్, బొంతు శ్రీను, బి. వెంకట్రావు, కాకర వెంకటేశ్వర్లు మాట్లాడారు.

లాభసాటి వరి వంగడాలు సాగు చేయాలి

భీమవరం : రైతులు లాభసాటి వరి వంగడాల సాగు చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి కోరారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి వ్యవసాయ ప్రాధాన్యత కలిగిన వరి వంగడాలు సాగు గురించి వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు, వ్యవసాయ అడ్వయిజరీ బోర్డ్ ఛైర్మన్ సభ్యులు, ట్రేడర్స్, మిల్లర్స్‌తో జిల్లా సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పాటు చేసి, జిల్లాలోని ప్రాంతాలకు అనుగుణంగా పండించగలిగే వెరైటీ క్లస్టర్లను ఏర్పాటు చేయాలన్నారు. ఒక రైతుకు పదెకరాల భూమి ఉంటే అందులో రెండెకరాలు ప్రీమియం వెరైటీస్‌ను పండించి లాభాలను అంచనా వేసుకొని చూడాలన్నారు. 100 ఎకరాల నుండి 150 ఎకరాలకూ వరకూ ఒక క్లస్టర్ గా నిర్ణయించుకుని నాణ్యమైన, ఎగుమతికి అనువైన రకాలు పండించేందుకు ముందుకు రావాలన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ కైగాల శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బాధితులకు జనసేన సాయం

తాడేపల్లిగూడెం: మోదుగుంటలో మంగళవారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో ఇల్లు కోల్పోయిన బాధితులు కొనకల్ల వెంకన్న, పుష్పవతిని పరామర్శించి వారికి రూ.20 వేలు, ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన నాయుడు సత్యనారాయణ, నాగమణి కుటుంబాన్ని పరామర్శించి వారికి రూ.పది వేల ఆర్థిక సాయాన్ని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొలిశెట్టి శ్రీనివాస్ బుధవారం అందజేశారు. కార్యక్రమంలో గూడెం మండల అధ్యక్షుడు అడపా ప్రసాద్ పాల్గొన్నారు.

ఇంటింటా అపూర్వ ఆదరణ : ఎంఎల్ఎ

పాలకోడేరు: ప్రతి ఇంటికీ వెళ్తున్న సందర్భంలో ప్రజల నుంచి అపూర్వ ఆదరణ లభిస్తోందని ఎంఎల్ఎ మంతెన రామరాజు అన్నారు. గొల్లల కోడేరులో టిడిపి మండల అధ్యక్షులు దెందుకూరి ఠాగూర్ కోటేశ్వరరావు, గ్రామ అధ్యక్షులు కమ్మిలి రాంబాబు, మాజీ సర్పంచి గాదిరాజు సూర్య నారాయణ రాజు ఆధ్వర్యంలో ఇంటింటా మన బాబు కార్యక్రమాన్ని రెండో రోజు బుధవారం నిర్వహించారు. అనంతరం ఎంఎల్ఎ మాట్లాడారు. వైసిపి అధికారంలోకి వచ్చాక అభివృద్ధిని మరిచిందన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్ట విరుద్ధం

ఆచంట (పెనుమంట్ర): బాల్య వివాహాలు చట్ట విరుద్ధమని ఎంఇఒ-2 ఉంగరాల నాగేశ్వరరావు అన్నారు. బుధవారం పెనుమంట్ర పెదచెరువు గట్టు కోడ్ నంబరు 5లో భేటీ బచావో, భేటీ పడావో కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులకు అవగాహన, ర్యాలీ, మానవహారం నిర్వహించారు.

In the Court of the Prl. Senior Civil Judge, Eluru
E.P. No. 5/2022, O.S. No. 239/12
Between:
Cheekati Krishna Rao and Another ...DHR
AND
Cheekati Venkata Rao and Others ...JDRs
JDR-5: Kasana Suryanarayana, S/o. Rama Rao, Hindu, Male, aged 41 years, Cultivation, D.No. 2-15.
JDR-6: Chintalapudi Venkata Naga Suryanarayana Murthy, S/o. Kedareswara Rao, Hindu, Male, aged 50 years, Cultivation, D.No. 2-17, aboveparties, Ankalapadu (V), K.Kota (M), W.G.District, ChJCJC.
కోర్టు ప్రకటన
పై నెంబరు గల E.P. లో JDRS 5 & 6 లకు ఎన్నిసార్లు కోర్టు సమన్లు పంపిన పుచ్చుకోకుండా కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు JDRS5 & 6 లకు నోటీసులు అమలు నిమిత్తం పేపరు పబ్లికేషన్‌కు ఆర్డరు వేసినారు. కావున పై వారికి ఏమయిన ఆక్షేపణలు ఉన్న యెడల పై కోర్టు ఎదుట ది. 15-12-2023వ తేదీ ఉదయం గం॥ 10.30 ని॥లకు హాజరు కావలెను. లేనిచో మీ పరోక్షమున తీర్పు చెప్పబడును.
NEKKARAGANTI NARASIMHA RAO
Eluru Advocate, Eluru
Dt.20-11-2023 Cell: 9848118984

మహారాజశ్రీ అదనపు సీనియర్ సివిల్ జడ్జి, ఏలూరు
ఇ.పి. నెం. 18/2022
ఒ.యస్. నెం. 45/2019
Between:
కారంగుల శివరామప్రసాద్ -పిటీషనరు/ డిక్రీ హోల్డర్
మరియు
మొక్కరాల శ్రీలత, మరియొకరు -రెస్పాండెంట్స్/జేడిఆర్స్
పిటీషనరు/ డిక్రీ హోల్డర్ దాఖలు చేసిన పబ్లికేషన్
పై నంబరు గల ఇ.పి. వాంటు గ్రంధములో శ్రీ కోర్టు వారు ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని ది. 20-12-2023వ తేదీన ఉదయం 10.30 ని॥లకు వేలం వేయుదురు. ఆసక్తి ఉన్నవారు సదు వేలంలో పాల్గొనవచ్చును. పూర్తి వివరములకు డిక్రీ హోల్డర్ ప్లీడరు గారిని సంప్రదించవచ్చును.
షెడ్యూలు
పశ్చిమగోదావరి జిల్లా, ప్రస్తుతం ఏలూరు జిల్లా, పెదవేగి మండలం, ఏలూరు సబ్ రిజిస్ట్రీ యిలాక జానంపేట గ్రామపంచాయతి, జానంపేట గ్రామం దాఖలా రి.స. నెం. 393/1 దాఖలా 314 చ॥గజాలు స్థలం అందలి ఆర్‌సిసి బిల్డింగ్‌నకు హద్దులు.
తూర్పు: 2 గజముల వెడల్పు గల జాయింటు దారి.
దక్షిణం: కొటిక నాగరాజు గారి స్థలం.
పడమర: ఆత్కూరి వెంకటరత్నం గారి స్థలం.
ఉత్తరం: జగన్నాధపురం గ్రామం రోడ్డు.
డిక్రీ హోల్డరు విలువ: రూ. 15,00,000/-
అమీనా విలువ: ఊ. 26,00,000/-
ఆవుల జగన్మోహనరావు
పుప్పాల రామకృష్ణ
ఏలూరు అడ్వకేట్సు, శ్రీరామ నివాస్
ది.29-11-2023 అశోక్‌నగర్, ఏలూరు

వేలం ప్రకటన
మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, నూజివీడులో
ఇ.పి. 13/2017 ఇన్
ఓ.యస్. నెం. 925/2015
బిట్వీన్:
పుట్టా సురేంద్రబాబు -డి. హెచ్.ఆర్.
మరియు
రుద్రరాజు సీతారామాంజనేయరాజు -జె.డి.ఆర్.
కృష్ణా జిల్లా, నూజివీడు సబ్ రిజిస్ట్రార్ వారి యిలాకా, నూజివీడు మండలం, రావిచర్ల గ్రామపంచాయతి, రావిచర్ల గ్రామ ఆర్.యస్. నెం. 294/1 దాఖలా య. 1-62 సెంట్లులలో అనిర్ధిష్టపు సగ భాగమును పై తెలిపిన జే.డి.ఆర్. యొక్క సంపూర్ణ స్వాధీన హక్కు భుక్తములలో వుండి ఈ డిక్రీ బాకీ క్రింద జప్తు ఛార్జి కాబడి, వేలం కావలసియున్న ఆస్తికి హద్దులు.
తూర్పు: గారపాటి నాగేశ్వరరావు గారి ఆస్తి.
దక్షిణం: మరీదు రామశాస్త్రులు గారి ఆస్తి.
పడమర: బెజవాడ శ్రీనివాసరావు గారి ఆస్తి.
ఉత్తరం: రోడ్డు.
డి. హెచ్.ఆర్. విలువ: రూ. 8,00,000/-
అమీనా విలువ: ఊ. 15,00,000/-
పైన తెలిపిన ఆస్తిని శ్రీ కోర్టు వారు ది. 29-12-2023వ తేదీన ఉదయం 10.30 ని॥లకు బహిరంగ వేలం వేయుదురు. కావున కావాల్సిన వారు పాడుకొనవచ్చును. తదుపరి వాయిదా ది. 05-01-2024
(కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
యమ్.రమేష్
డి.హెచ్.ఆర్. తరపు న్యాయవాదులు
నూజివీడు, సెల్: 9440257636

మహారాజశ్రీ కొవ్వూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు
O.S. No. 283/2021
Between:
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బజార్ బ్రాంచ్, కొవ్వూరు, రిప్రజెంటెండ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్. -వాది
AND
పార్వతి రెడీమేడ్స్ మరియు క్లాత్ స్టోర్స్, ప॥గో॥జిల్లా. -ప్రతివాదులు
To:
శ్రీమతి ఉప్ప కనకదుర్గ దేవి, W/o. చంద్రరావు, డో.నెం. 3-35, కొత్తూరు, పోలవరం మండలం, పశ్చిమగోదావరి జిల్లా. -ప్రతివాది
పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/ నోటీసులు పంపినా మీరు వాటిని ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున ది. 30-11-2023 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు దావాను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
రాజమండ్రి ఎం.వి.ఎస్.రామారావు
25-11-2023 అడ్వకేట్, కొవ్వూరు

ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినది
నేను, దాకమారి దానయ్య, తండ్రి: దాకమారి మంగారావు, రామాలయం వీధి, కావలిపురం, ఇరగవరం మండలం, పశ్చిమగోదావరి జిల్లా, ఆం.ప్ర. అను నా పేరున ఉన్న పాస్‌పోర్టు నెం. **V4837380** రు గలది ఒరిజినల్ జిరాక్స్ తీయించుటకు షాపునకు వెళుతుండగా పోయినది. దొరికినవారు పై అడ్రస్‌లోని **సెల్: 80082 45424** కు తెలియజేయగలరు.
దాకమారి దానయ్య
తండ్రి: దాకమారి మంగారావు
రామాలయం వీధి, కావలిపురం
ఇరగవరం మండలం, పశ్చిమగోదావరి జిల్లా

In The Court Of The Addl. Senior Civil Judge :: Eluru
E.P.No.66/2018, O.S.No.127/2016
Between:
Karumanchi Ravi Kumar (Died) ...D.H.R
Mulagaleti Subhadra and another
AND
Navanasi Venkata Appa Rao, S/o. Surya Rao, Badeti Vari Street, Eluru. ...J.D.R
వేలం ప్రకటన
పై నెంబరు గల ఇ.పి. గ్రంధములో ఈ క్రింది తెలిపిన ఇ.పి. షెడ్యూలు దాఖల ప్రోపర్టీని శ్రీ కోర్టు వారు ది.20-12-2023వ తేదీ ఉ॥ 10:30 ని॥ల నుండి వేలం వేయబడును. కావున ఆసక్తి కలవారు అనగా వేలంలో పాల్గొనదలచిన వారు ఆధార్ కార్డు ఒరిజినల్ మరియు జిరాక్సు, 1/4 వంతు అమౌంటుతో పై తెలిపిన కోర్టు ఎదుట హాజరు కావలెను.
SCHEDULE
323-4-0 Square Yards Equal to 268 Squar Meters in which Residential House is existed on the worth out of AC 4-08 Cts covered by R.S.No. 59/11 of Tangellamudi (V), Tangellamudi Panchayathi, Eluru (M), Eluru District, Eluru Sub Registrar within the following boundaries:
EAST: 24 Feet width road 42-0.
SOUTH: Site of Polegani Gopala Krishna 67-0.
WEST: Site of Kadiyala Chandrayya Etc., 44-9.
NORTH: Site of Bellemkonda Venkateswara Rao 67-0.
D.H.R. Value : Rs.3,21,000-00
Amina Value : Rs.40,30,000-00
ఏలూరు, నెక్కరగంటి నరసింహారావు
24-11-2023. అడ్వకేట్, ఏలూరు.